7

సాక్షి సంగారెడ్డి

సోమవారం ♦ 7 ♦ ఏప్రిల్ ♦ 2025



పటాన్‌చెరులో స్వామి వారి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు.



జోగిపేటలోని పబ్బతి హనుమాన్ దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర



ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి



పటాన్‌చెరులో పట్టు వస్త్రాలు,తలంబ్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే గూడెం



సంగారెడ్డిలో ఆభరణాలను తీసుకొస్తున్న జగ్గారెడ్డి దంపతులు

కల్యాణం.. కమనీయం

పటాన్‌చెరు/జోగిపేట (ఆందోల్)/సంగారెడ్డిజోన్: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఊరు వాడల్లోని అన్ని దేవాలయాలు రామ నామ స్మరణతో మార్మోగాయి. మధ్యాహ్నం 12 గంటల 20 నిమిషాలకు అభిజిత్ లగ్నంలో వేద మంత్రోచ్చారణలు, జై శ్రీరామ్ నినాదాల మధ్య అర్చకులు సీతారాముల కల్యాణఘట్టాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవం ఆద్యంతం భక్తులను కనువిందు చేసింది. సంగారెడ్డి పట్టణంలోని రామ మందిరం ఆలయంలో జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి దంపతులు వారి నివాసం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా ఆభరణాలు తీసుకువచ్చి స్వామి వారికి అలంకరించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక జోగిపేటలో స్థానిక పబ్బతి హనుమాన్, వీరహనుమాన్, శ్రీరామ మందిరంలో సీతారాముల కల్యాణోత్సవానికి మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. పటాన్‌చెరులోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు సమర్పించారు. పలు దేవాలయాల్లో భక్తులకు అన్న ప్రసాద వితరణలు చేశారు.

న్యూస్‌రీల్

టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని హోతి(కె) జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సురేఖ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 వరకు దరఖాస్తుకు గడువు ఉందని వెల్లడించారు. 2025 మార్చిలో పదవ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న గోదావరి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పిలుపునిచ్చారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సంగారెడ్డిలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఆమె పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోదావరి మాట్లాడుతూ...కార్యకర్తలందరూ పార్టీ పటిష్టత కోసం కృషి చేయడంతోపాటు ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నడూ లేనివిధంగా నేడు దక్షిణాదిలో కూడా కాషాయ జెండా రెపరెపలాడే సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తోంది

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



బీటీ రణదివె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను కేంద్రంలోని మోదీ సర్కారు కాలరాస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ విమర్శించారు. కార్మిక వర్గాల ఐక్యత కోసం సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివె ఎనలేని కృషి చేశారన్నారు. బీటీ రణదివె 35వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పటాన్‌చెరులోని శ్రామిక్ భవన్ లో ఆయన చిత్రపటానికి మల్లికార్జున్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ....సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6 నుంచి 14 వరకు మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరపాలని పిలుపునిచ్చారు.

ప్రజల్లో చిరస్థాయిగా గద్దర్

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల



గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెన్నెల

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజా సమస్యల కోసం పోరుబాట పట్టిన ప్రజా గాయకుడు గద్దర్ అణగారిన వర్గాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల పేర్కొన్నారు. తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం వద్ద మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్, గద్దర్ గళం వ్యవస్థాపకుడు కె.సత్తయ్య ఆధ్వర్యంలో రూ.1.25 కోట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న గద్దర్ స్మృతివనానికి ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం గద్దర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...1997 ఏప్రిల్ 6న ప్రజా గాయకుడు గద్దర్‌పై కాల్పులు జరిగాయని గుర్తు చేశారు. అణగారిన వర్గాలలో చైతన్యం రగిలించి అస్తమించిన సూర్యుడే గద్దరని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గాదె ఇన్నయ్య, పాశం యాదగిరి, గజ్జల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి విత్తన భారం

జిల్లాలో 3.60లక్షల ఎకరాల్లో పత్తి సాగు


- వివిధ కారణాలతో పంట దిగుబడిపై ప్రభావం
- పెరిగిన పెట్టుబడి ఖర్చులతో రైతన్న ఆందోళన



పత్తి పంట

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సాగు చేస్తున్న పంటలలో అత్యధికంగా పత్తి పంట సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. కొన్నేళ్లుగా ప్రతీ ఏటా పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అలాగే పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే పత్తి ప్యాకెట్ల విత్తన ధరలు పెరిగాయి. వివిధ కంపెనీల విత్తనాల ధరలు పెంచడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు

ఏటా పెరుగుతున్న పత్తి పంట సాగు



జిల్లాలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్న వాణిజ్య పంటలలో పత్తి పంటని అత్యధికంగా సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది జిల్లాలో 3.60 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు చేయగా అంతకుముందు ఏడాదిలో 3.50 లక్షల ఎకరాలకు పైగా పత్తి పంటను సాగు చేసినట్లు సమాచారం. పెరుగుతున్న ధరలతో వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం పెరుగుతుందా? తగ్గుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

తగ్గుతున్న పంట దిగుబడి

పత్తి పంట వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులకు ఆందోళన తప్పడం లేదు. సరైన సమయానికి వర్షాలు కురవకపోవడం, అవసరం లేని సమయంలో వర్షాలు ఎక్కువగా పడటం, పూత ఖాత సమయంలో వర్షాల ప్రభావం తదితర కారణాలతో పంట దిగుబడులపై ప్రభావం చూపుతుంది. చేతికొచ్చిన పత్తి పంట తీసే సమయంలో కూలీలు దొరకకపోవడంతో కూడా పంట నేలకు రాలి దిగుబడి తక్కువగా వస్తుంది.

పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

పత్తి పంట సాగు చేసేందుకు ఒక ఎకరాకు రూ.45 వేల నుంచి రూ.50 వేల ఖర్చు వస్తుంది. దుక్కి దున్నటం నాటి నుంచి భూమిని చదును చేయడం, విత్తనాలు వేయడం, కలుపు, మందులు పిచికారీ చేయడం, పత్తి తీత కూలి ఖర్చులు తదితర పనులుంటాయి. ఎకరాకు రెండు ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరం ఉంటుందని రైతులు చెబుతున్నారు. గతేడాది బీటీ–2 పత్తి విత్తనం 475 గ్రాముల ప్యాకెట్ ధర రూ.867 ఉంటే ఈ ఏడాది అదే ప్యాకెట్ ధర రూ.901కు పెరిగింది. అన్ని రకాల పత్తి విత్తనాల ధరలు ఆయా కంపెనీలు పెంచేశాయి. పెరుగుతున్న పెట్టుబడులతో పత్తి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

మద్దతు ధర ఉంటేనే లాభాలు

పత్తి పంటకు మద్దతు ధర రూ.10 వేలు ఉంటేనే మంచి లాభాలు వస్తాయని రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా పత్తి ధర నిలకడగా లేకపోవడంతో ధర పెరుగుతుందనే ఆశతో కొన్ని నెలలపాటు పత్తి పంటను నిల్వ ఉంచుకున్నారు. ధర పెరగకపోవడంతో నిల్వ ఉన్న పత్తితో అనారోగ్య సమస్యలు తలెత్తాయి.

18 ఎకరాల్లో పత్తి సాగు



నేను ప్రతీ ఏటా 18 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తాను. విత్తన ప్యాకెట్ల ధరలను పెంచటం సరికాదు. ధరలు పెంచటంతో ఖర్చులు పెరుగుతున్నాయి. ధరలు పెంచకుండా చర్యలు తీసుకోవాలి.

–గోపాల్ రెడ్డి, గ్రా.కక్కర్‌వాడ, మం.ఝరాసంగం

పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి



ప్రతీ సంవత్సరం పత్తి పంట సాగు చేసేందుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఒక ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి ఖర్చులు వస్తున్నాయి.

–శ్రీనివాస్ రెడ్డి, పత్తి రైతు, గ్రా.బొప్పన్ పల్లి, మం.ఝరాసంగం



పనులు పూర్తి కావడంతో రంగులు దిద్దుకున్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి

రైల్వే ఫ్లైఓవర్

- ప్రారంభోత్సవానికి సిద్ధం
- తీరనున్న ట్రాఫిక్ కష్టాలు
- రూ.90కోట్ల వ్యయంతో నిర్మాణం
- రూ.50కోట్లు భూ సేకరణ కోసం, రూ.40 కోట్లు నిర్మాణం పనులకు కేటాయింపు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. సీసీ పనులు పూర్తి చేసుకుని రంగులద్దుకుంటోంది. బ్రిడ్జి పైభాగంలో ఎలక్ట్రిక్ పనులు చేపట్టాల్సి ఉంది. 10–15 రోజుల్లో ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 95% మేర నిర్మాణం పనులు పూర్తయినట్లు రోడ్లు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బీ) అధికారులు చెబుతున్నారు. వంద మీటర్ల మేర సరీ్వసురోడ్డు, డ్రైనేజీ కాలువ పనులు మిగిలి ఉన్నాయి. ప్రాజెక్టు అంచనా రూ.90కోట్లు కాగా, ఇందులో రూ.50 కోట్లు భూ సేకరణ కోసం కేటాయించారు. రూ.40 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం కోసం 17వేల క్యూబిక్ మీటర్ల మట్టిని ఉపయోగించారు. మట్టికి సంబంధించి మైనింగ్ శాఖకు రాయల్టీ చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. బ్రిడ్జి వద్ద నుంచి బీదర్ క్రాస్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. బ్రిడ్జి పైభాగంలో ఎలక్ట్రిక్ ఫిక్సేషన్ పనులు చేపట్టాల్సి ఉంది. వైరింగ్, విద్యుత్ స్తంభాల బిగింపు పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇప్పటి వరకు చేపట్టిన సీసీ నిర్మాణం పనుల్లో 50% ఇసుక, 50% మట్టిని ఉపయోగించినట్లు అధికారులు వివరించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఏఈఈ సంధ్య పేర్కొన్నారు.

ఆరేళ్లకు మోక్షం

నిర్మాణం పనులు చేపట్టిన ఆరేళ్లకు రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి కావస్తోంది. స్థానిక లెవెల్ క్రాసింగ్ మీదుగా హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి నాందేడ్, పూర్ణ, షిర్డీ, పర్లీ, లాతూర్ ప్రాంతాలతోపాటు బెంగళూరు, తిరుపతి, కాకినాడ ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంలో రైలు వచ్చిన ప్రతీసారి గేట్లు మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రజలతో పాటు అంతర్రాష్ట్ర రాక పోకలు సాగించే ప్రయాణికులు రైలు వచ్చిన ప్రతీసారి రైల్వే గేటు వద్ద కనీసం 20 నుంచి 30 నిమిషాలపాటు ఆగాల్సి వస్తోంది. కష్టాలను దూరం చేసేందుకు వీలుగా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.90కోట్లు మంజూరు చేసింది. 2018 ఆగస్టు 30న ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు.

శాశ్వతంగా తీరనున్న కష్టాలు

రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయ్యి వినియోగంలోకి వస్తే వాహనదారుల కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి. జహీరాబాద్–పర్లీ తదితర ప్రాంతాలకు నిత్యం 36 రైళ్ల వరకు రాక పోకలు సాగిస్తున్నాయి. దీంతో తరచూ రైల్వే గేటు మూసి ఉంచడంతో ట్రాఫిక్ స్థంభించి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి ఉంది. బ్రిడ్జి పనులు పూర్తిచేసి వినియోగంలోకి వస్తే ప్రజలు, ప్రయాణికుల కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి.

అంగన్‌వాడీల్లో కంటి పరీక్షలు

- నేటి నుంచి ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా 1,504 కేంద్రాలు
- 80,277 మంది చిన్నారులకు పరీక్షలు
- రెండునెలల పాటు కార్యక్రమం




విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి పరీక్షలు (ఫైల్)

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఆరేళ్లలోపు చిన్నారులకు కంటి, మానసిన సమస్యలను గుర్తించేందుకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నెల 7న ప్రారంభించి రెండునెలల పాటు పూర్తయ్యే వరకు ఈ పరీక్షలు కొనసాగించనున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరేట్ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా విడుదల చేసింది. జిల్లా మొత్తంలో 1,504 అంగన్‌వాడీ కేంద్రాల్లో 80,277మంది 0– 6 ఏళ్లలోపు చిన్నారులు పౌష్టికాహారం పొందుతూ చదువుకుంటున్నారు. వీరందరికీ కంటి, మానసిక పరీక్షలను చేయనున్నారు. ఇదివరకే రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఒకటవ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు రెండు విడతలుగా కంటి పరీక్షలను పూర్తి చేశారు. మూడో విడతగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పరీక్షలు చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యధికంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేది పేద, మధ్యతరగతి వర్గాల పిల్లలే. కాగా, ఆయా పిల్లలు సరైన పర్యవేక్షణ లేక కంటి, మానసిన సమస్యలను ఎదుర్కొనే అవకాశముంది. ఈ సమస్యలు చిన్న తనంలోనే గుర్తించి సరిచేసేందుకు ప్రభుత్వం పరీక్షలు నిర్వహించేందుకు ఉపక్రమించింది.

పరీక్షలు ఇలా..

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్ల వైద్య సిబ్బందితోపాటు ఆప్తాల్మిక్ నిపుణులు చిన్నారులకు లీచార్ట్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్‌ను భాగస్వాములను చేస్తూ చిన్నారులకు ప్రత్యేకంగా బొమ్మలతో రూపొందించిన లీ చార్ట్ చూపిస్తూ ప్రశ్నించనున్నారు. చూపు సరిగా ఉన్నదీ లేనిదీ నిర్ధారించనున్నారు. చిన్నారులకు కంటిలో ఏవైనా మచ్చలున్నాయా, దృష్టితోపాటు, మెల్ల కన్ను, కార్నియా సమస్యలు, నిర్ధారిత దిశలో కళ్లు చూడకపోవడం, కళ్లల్లో తగినంత తేమ లేకపోవడం, పొడిబారుతుందా తదితర విషయాలపై ఆప్తాల్మిక్ నిపుణులు పరీక్షించనున్నారు. కంటి సమస్యలున్న చిన్నారులకు బోధనాస్పత్రుల్లో తగిన చికిత్సలు అందిస్తారు. మానసిక సమస్యలపై పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించనున్నారు. చిన్నారుల ఎదుగుదల, ఎత్తు, బరువు, ఎలా మాట్లాడుతున్నారు? మాటలు సరిగా వస్తున్నాయా లేదా, ఆయా వస్తువులను గుర్తిస్తున్నారా లేదా, ప్రవర్తనల్లో ఏమైనా మార్పులున్నాయా అనే అంశాలను కూడా వైద్యులు అడిగి తెలుసుకుంటారు.

పరీక్షలకు సిద్ధం



జిల్లాలోని 0– 6 ఏళ్లలోపు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కంటి, మానసిక ఎదుగుదలపై పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ నెల 7 నుంచి విద్యార్థులందరికీ పూర్తయ్యే వరకు రెండునెలల పాటు పరీక్షలు నిర్వహిస్తాం.

గాయత్రీదేవి, జిల్లా వైద్యాధికారి, సంగారెడ్డి

నీరు ఇంకిపోతోంది!

- అటకెక్కిన ఇంకుడు గుంతల పథకం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వేసవిలో పెరుగుతున్న నీటి కొరత



ఇంకుడు గుంత

మునిపల్లి(అందోల్): ఎండలు మండిపోతుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు పెంచేందుకు గత ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంకుడు గుంతకు రూ.4,040 చొప్పున మంజూరు చేసింది. ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకుంటే ఒనగూరే ప్రయోజనాలను సంబంధిత అధికారులు వివరించి వాటిని ఇళ్ల వద్ద ఏర్పాటు చేయించారు. ఇంకుడు గుంతలను చేతి పంపు, గ్రామ పంచాయతీ బోరు మోటర్లు, మినీవాటర్ ట్యాంకులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి వద్ద, ఖాళీస్థలాల్లో నీరు పోయే విధంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేవారు.

జిల్లాలో గ్రామ పంచాయతీలు	647
జాబ్‌కార్డులు	2.2 లక్షలు
దరఖాస్తు దారులు	31,354 మంది
నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు	27,577 మంది
ఒక్కో ఇంకుడు గుంతకు	రూ.4,040

బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం...

ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటే తగిన డబ్బులు చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పడంతో చాలామంది ఉత్సాహంగా ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకు వచ్చారు. అలాగే అధికారులు బిల్లులు కూడా మంజూరు చేశారు. తర్వాత తర్వాత ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్న వారికి బిల్లుల మంజూరు చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడంతో వాటి ఏర్పాట్ల పట్ల ప్రజల్లో ఆసక్తి సన్నగిల్లింది. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో మిగిలిన వారు కూడా ఇంకుడు గుంతల ఏర్పాట్లపై వెనుకంజ వేశారు.

నిర్వహణపై అలసత్వం

భూగర్భ జలాలు పెరిగేందుకు చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం, వాటి నిర్వహణను అధికారులు, ప్రజలు ఎన్నడో మరిచిపోయారు. వాస్తవానికి వేసవి రాకముందే ఎక్కడెక్కడ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలో ఆయా స్థలాల్లో అధికారులు మార్కింగ్ వేసి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించేవారు. వర్షాకాలం రాగానే ఇంకుడు గుంతలకు వర్షం నీరంతా వెళ్లి భూ గర్భ జలాలు పెరిగేవి. ఇండ్లలో ఉన్న వారంతా వాడిన నీరుతో పాటు వర్షం నీరు ఇంకుడు గుంతలకు పైపులైన్ ద్వారా గుంతలోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇంకుడు గుంతలను ఇంటి యజమానులు వినియోగించుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. దీంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పూర్తిస్థాయి వేసవి కాలం రాకుండానే జిల్లాలో నీటి ఎద్దడి పరిస్థితులు నెలకొన్నాయి.

ఎవ్వరికీ ఇబ్బంది ఉండదు



ఇంకుడు గుంత ఏర్పాటుతో మనం వాడే నీరంతా అందులోకి వెళ్లి ఎవరికీ ఇబ్బంది ఉండదు. సంబంధిత అధికారులు స్పందించి ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఈ పథకాన్ని పునఃరుద్ధరించాలి. ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేయించి భూగర్భ జలాలు పెరిగేందుకు కృషి చేయాలి.

– గంజి ప్రభు

నిరంతరంగా కొనసాగుతుంది



ఇంకుడు గుంతల ఏర్పాటు నిరంతరంగా కొనసాగుతోంది. జాబ్‌కార్డులో పేరుండి, గుంతలు ఏర్పాటు చేసుకుంటామని దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులు మండలంలో ఏపీఓ, పంచాయతీ కార్యదర్శి దగ్గర దరఖాస్తు చేసుకోవచ్చు. గుంతకు రూ.4,040ల చొప్పున లబ్ధిదారుకు మంజూరు చేస్తారు.

– జ్యోతి ,డీఆర్‌డీఓ పీడీ

క్లుప్తంగా

కుక్కల దాడిలో జింక మృతి


మృతి చెందిన జింకను పరిశీలిస్తున్న బీట్ అధికారి రాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుక్కల దాడిలో జింక మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... ఆదివారం ఉదయం గ్రామంలోని గణేశ్‌పల్లి రోడ్డు పక్కన పంట భూమిలో జింక ఉండగా కుక్కలు చూసి వెంటపడ్డాయి. కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన జింక మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీట్ అధికారి రాజు ఘటనా స్థలానికి చేరుకొని జింకను పరిశీలించి పంచనామా చేశారు. పోస్టుమార్టం నిర్వహించి పూడ్చిపెడతామని తెలిపారు.

బోరుబావుల వద్ద కేబుల్‌వైర్లు చోరీ

దుబ్బాక: దుబ్బాక పట్టణం శివారులోని రుషీవనం సమీపంలో 10 మంది రైతులకు చెందిన కేబుల్‌వైర్లు చోరీకి గురయ్యాయి. బోరు బావులకు చెందిన స్టార్టర్ డబ్బా నుంచి మోటర్ల వద్దకు వెళ్లే వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకొని ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పోలీసులు కేబుల్‌వైర్లు చోరీకి గురైన బోరుబావులను పరిశీలించారు. కాగా చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకోవాలని బాధిత రైతులు కోరారు.

చేపల వేటకు వెళ్లి.. మంజీరాలో మునిగి


యాదగిరి మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): చేపల వేట కోసం మంజీరా నదిలోకి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడిన సంఘటన మండల పరిధిలోని తుక్కాపూర్ శివారులో ఆదివారం జరిగింది. కొల్చారం పోలీసులు తెలిపిన వివరాలు.. టేక్మాల్ మండలం అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన గుండు యాదగిరి (32) శనివారం రాత్రి సమీపంలోని మంజీరా నదిలో చేపల వేట కోసం ఇంటి నుంచి స్కూటీపై వెళ్లాడు. తెల్లవారిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నది సమీపంలోకి వెళ్లి చూడగా తెప్ప మాత్రమే కనిపించింది. అనుమానం వచ్చి గజ ఈతగాళ్ల సాయంతో నదిలో వెతికారు. చేపల వల చుట్టుకొని నిర్జీవంగా ఉన్న యాదగిరి మృతదేహం లభించింది. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తీసుకున్న డబ్బులివ్వాలని అడిగితే.. హత్య

గజ్వేల్‌రూరల్: తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలన్న వ్యక్తిపై దాడికి పాల్పడి హత్య చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని కోమటిబండలో ఆదివారం వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసుల కథనం ప్రకారం... గజ్వేల్ పట్టణానికి చెందిన సన్నిది దుర్గయ్యకు ముగ్గురు కూతుర్లు, కొడుకు ఆంజనేయులు(30) ఉన్నాడు. కోమటిబండకు చెందిన ప్రేమకు భర్తతో పాటు ఒక కూతురు ఉన్నారు. కూలీ పనులు చేసుకునే ఆంజనేయులుకు ఆమెతో పరిచయం ఏర్పడటంతో 2020లో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ కలిసి హైద్రాబాద్‌తో పాటు సూర్యాపేట, చేవెళ్ల ప్రాంతాల్లో జీవనం సాగించగా కొడుకు శ్రీనాథ్(2) ఉన్నాడు. ఓ చోరీ కేసులో జైలుకు వెళ్లిన ఆంజనేయులు 15రోజుల క్రితం బయటకు రావడంతో గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కోమటిబండకు వెళ్లి అత్త భారతిని కలిసి తనకు రావాల్సిన రూ. 3లక్షలు తిరిగి ఇవ్వాలని, లేనిపక్షంలో ఇంటిని తన పేరున రాసివ్వాలని గొడవకు దిగాడు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి దుర్గయ్య అక్కడికి చేరుకొని అతడికి నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చాడు. తిరిగి సాయంత్రం మళ్లీ వెళ్లి వారితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఆంజనేయులుకు వరుసకు సోదరుడు(సడ్డకుడు) అయిన నక్కల శివ ఇనుప గడ్డపారతో తలపై కొట్టాడు. ఈ ఘటనలో అతడు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణాలు తీస్తున్న సరదా

ఈతకు వెళ్లి కానరాని లోకాలకు..
- ఆరునెలల వ్యవధిలో నలుగురు మృత్యువాత
- కుటుంబాలకు తీరని వ్యథ
- నీటి వనరుల వద్ద కానరాని భద్రతా చర్యలు

ఈత సరదా యువకుల ప్రాణాలు తీస్తోంది. జిల్లాలో కేవలం ఆరునెలల వ్యవధిలో పాతికేళ్లలోపు యువకులు నలుగురు మృత్యువాత పడ్డారు. గతంలో మంజీరా నదిలో ఇద్దరు.. తాజాగా శనివారం మధ్యాహ్నం బొల్లారం మత్తడిలో మరో ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు నీటి వనరుల వద్ద భద్రతా చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

–మెదక్‌జోన్

అందరూ పాతికేళ్లలోపు వారే..

అయితే బొల్లారం మత్తడి మెదక్ మండలంలోని పలు గ్రామాలకు సమీపంగా ఉంటుంది. ఇందులోకి ఘనపూర్ ఆనకట్ట నుంచి నీరు వచ్చి చేరటంతో మండు వేసవిలో నిండుకుండలా మారుతుంది. దీంతో యువత అందులోకి ఈత కోసం వెళ్తుంటారు. అయితే ఇప్పటివరకు ఈ మత్తడి నలుగురు యువకులను బలి తీసుకుంది. గతేడాది ఫిబ్రవరిలో జానకంపల్లికి చెందిన యువకుడు మిత్రులతో కలిసి స్నానం చేస్తుండగా నీట మునిగి మృతిచెందాడు. అలాగే తిమ్మక్కపల్లికి చెందిన మరో యువకుడు మత్తడిలో మునిగి చనిపోయాడు. ఇంత జరుగుతున్నా అధికారులు అక్కడ ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టడం లేదు. అలాగే ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం సమీపంలో మంజీరా నది ఎప్పుడు నిండుకుండలా ఉంటుంది. భక్తులు ముందుగా మంజీరా పాయల్లో స్నానం చేసి అమ్మవారిని దర్శించుకుంటారు. అయితే గత నెల 1వ తేదీన హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం ఏడుపాయలకు వచ్చి మూడు రోజుల పాటు అక్కడే గడిపారు. అందులో ఇద్దరు యువకులు పోతంశెట్‌పల్లి 2వ బ్రిడ్జి వద్ద నదిలో ఈతకు దిగి నీటమునిగి దుర్మరణం చెందారు. మంజీరాలో లోతు ఎక్కువగా ఉండటంతో పాటు రాళ్ల రప్పలతో నిండి ఉంది. ఈ


నిండుకుండలా బొల్లారం మత్తడి

ప్రదేశంలోనికి వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్కడ నిరంతరం పోలీస్ సిబ్బందిని ఉంచితే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అడ్డుకట్ట వేయవచ్చని చెబుతున్నారు.



అనిల్, నవీన్ మృతదేహాలు


రోదిస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

పండుగ పూట విషాదం

మెదక్ మండలం బాలనగర్‌కు చెందిన తుండు అనిల్ (17), తుండుం నవీన్ (25) శనివారం మధ్యాహ్నం బొల్లారం మత్తడికి ఈతకు వెళ్తున్నామని కుటుంబ సభ్యులకు చెప్పి బయలుదేరారు. అయితే రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు మత్తడి వద్దకు వెళ్లి చూడగా గడ్డపై ఇద్దరి దుస్తులు, చెప్పులు కనిపించారు. దీంతో గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో వెతకగా ఆదివారం మధ్యాహ్నం ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామానికి చెందిన తుండుం లలిత, పద్మయ్యకు కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా కూతురు పెళ్లి చేయగా.. అనిల్ పదో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్ద తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటున్నాడు. అయితే చేతికందివచ్చిన కొడుకు నీటి మునిగి చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదే గ్రామానికి చెందిన తుడుం బాలయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నీట మునిగి మృతిచెందిన నవీన్ (25) రెండో కుమారుడు. అతడికి మూడేళ్ల క్రితం పెళ్లి చేయగా రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం అతడి భార్య గర్భిణి. భర్త నీటి మునిగి చనిపోయాడని తెలియటంతో ఆమె రోదనలు మిన్నంటాయి.

ఆత్మహత్య కాదు.. హత్య

- వృద్ధ దంపతుల మృతిపై వీడిన మిస్టరీ
- నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మధు

నంగునూరు(సిద్దిపేట): తాగుడు, చెడు అలవాట్లకు బానిసలుగా వారిన యువకులు నగల కోసం వృద్ధ దంపతులను దారుణంగా కొట్టి చంపారు. మూడు రోజుల కిందట నంగునూరులో జరిగిన వృద్ధ దంపతుల అనుమానాస్పద మృతిపై సిద్దిపేట ఏసీపీ మధు ఆదివారం వివరాలు వెల్లడించారు. నంగునూరు మండల బద్దిపడగకు చెందిన పసువుల సంపత్, మాలోతు రాజు, మాలోతు శ్రీకాంత్ ముగ్గురు తాగుడుకు అలవాటు పడి జల్సాగా తిరుగుతున్నారు. నంగునూరుకు చెందిన పర్షరాములు వ్యవసాయ బావి వద్ద ఉన్న పౌల్ట్రీఫామ్‌లో పనులకు వెళ్లారు. పర్షరాములు తండ్రి అవుల కొముర‌య్య, తల్లి భూదవ్వ పౌల్ట్రీఫామ్ వద నివాసం ఉంటున్నారని తెలుసుకొని వారి వద్ద ఉన్న నగలును దొంగిలించాలని పథకం వేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వృద్ధులు పడుకున్న ఇంటి కిటికీలను తొలగించి లోనికి వెళ్లారు. అలికిడికి వృద్ధులు లేవడంతో గొంతు పిసికి, సిమెంట్ ఇటుకతో బాది హత్య చేశారు. అనంతరం భూదవ్వపై


నిందితులను చూపుతున్న పోలీసులు

ఉన్న మాటీలు, కమ్మలు, వెండి మొలతాడు దొంగిలించి కిటికిని ఎప్పటిలాగే పెట్టి పారిపోయారు. కేసు దర్యాప్తు చేసిన సిద్దిపేట రూరల్‌సీఐ శ్రీను, రాజగోపాల్‌పేట ఎస్ఐ అసిఫ్ నిందితులను మూడు రోజుల్లో పట్టుకొని వారి వద్ద నుంచి రెండు బైకులు, మూడు సెల్‌ఫోన్లు, వెండి మొలతాడు, రూ.30,800 స్వాధీనం చేసుకొని నిదుతులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.

ఉరేసుకొని వ్యక్తి...


రామస్వామి (ఫైల్)

దుబ్బాకటౌన్: అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం రామారంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కొమ్మాయిపల్లి రామస్వామి (40) ఆరు నెలల కింద పక్షవాతానికి గురయ్యాడు. వైద్యం చేయించుకున్నప్పటికీ పూర్తిగా తగ్గలేదు. దీంతో పక్షవాతం తగ్గడం లేదన్న మనోవేదనకు గురయ్యేవాడు. ఆదివారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్నట్లు ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. పొలం వద్ద మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల రైతులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమా చారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

మద్యం మత్తులో...

తొగుట(దుబ్బాక): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని బంజేరుపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవికాంత్‌రావు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బొమ్మ రాజు (35) మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానివేయాలని భార్య సరిత పలుమార్లు వారించినా వినిపించుకోలేదు. రోజూ మాదిరిగా ఉదయం సరిత గ్రామంలో కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి భర్త ఉరేసుకున్నాడు. వెంటనే ఆమె చుట్టుపక్కల వారి సహాయంతో ఆయనను కిందకి దించిచూడగా అప్పటికే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమారుడు, కూతురు, వృద్ధ తల్లిదండ్రులు ఉన్నారు.

మద్యానికి బానిసై...

సిద్దిపేటరూరల్: మద్యానికి బానిసై అప్పుల పాలై ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతమడక గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పెద్దెల్లి నర్సిహులు(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇదిలా ఉండగా తాగుడుకు బానిసై గ్రామంలో అప్పులు చేశాడు. దీంతో శనివారం ఉదయం భార్య విజయలక్ష్మి తాగుడు మానేయమంటూ భర్తను నిలదీయడంతో అప్పులు చేసిన నేనే అప్పులు తీర్చుతానంటూ కోపంగా ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం అయినా అతడు ఇంటికి రాలేదు. దీంతో విజయలక్ష్మి మరిది యాదగిరిని బావి వద్దకు వెళ్లి చూడాలని చెప్పింది. అక్కడికి వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. వెంటనే ఇంటికీ ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబీకులు అక్కడికి వెళ్లి చూసేసరికి అప్పటికే చనిపోయాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీజిల్ పోసుకొని మహిళ...

సిద్దిపేటకమాన్: మతిస్థిమితం సరిగా లేని ఓ మహిళ ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం... సిద్దిపేట కేసీఆర్ నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో వటారికారి సాయికుమార్ తన తల్లి గాయత్రి (55)తో కలిసి నివాసం ఉంటున్నాడు. సాయికుమార్ పట్టణంలో ఫుట్‌వేర్ షాప్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గాయత్రి భర్త ఏనిమిదేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి సరిగా లేదు. దీంతో హైదరాబాద్ ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స అందించి ప్రస్తుతం మందులు వాడుతున్నారు. ఆదివారం రోజు మాదిరిగానే సాయికుమార్ షాప్‌నకు వెళ్లగా గాయత్రి ఇంట్లో డీజిల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న సాయికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని చూడగా తన తల్లి మృతి చెంది ఉంది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఉమ్మడి జిల్లాలో ఆదివారం వేర్వేరు ఘటనల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

108 వాహనం బైక్ ఢీకొని...


రమేశ్ మృతదేహం

దుబ్బాకటౌన్: 108 వాహనం, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన రాయపోల్ మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన శంభు రమేశ్ తన బైక్‌పై రాంసాగర్ నుంచి రాయపోల్ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో దౌల్తాబాద్ నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్న 108 వాహనం రాయపోల్ కేంద్రంలోని నాగులమ్మ గుడి వద్ద బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి రమేశ్ కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేశ్ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

రోడ్డు దాటుతుండగా...

సంగారెడ్డి క్రైమ్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేష్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాట్ల మహేశ్ అలియాస్ యోహాన్ (28), మేస్త్రి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి సంగారెడ్డి వైపునకు వేగంగా వస్తున్న బస్సు ఢీ కొట్టింది. తీవ్రగాయాల కావడంతో హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. ఆదివారం సాయంత్రం వ్యక్తి మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మేస్త్రీ యూనియన్ లీడర్ కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బైక్ ఢీ..


జైపాల్‌రెడ్డి (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): ట్రాక్టర్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నారం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన జైపాల్ రెడ్డి (38)బైక్‌పై పొలం వద్దకు కూరగాయలు తేవడానికి వెళ్తుండగా జోడు బావుల మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో జైపాల్‌రెడ్డి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిన్నశంకరంపేట(మెదక్): పేకాటస్థావరంపై దాడి చేసిన పోలీస్‌లు పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈసంఘటన నార్సింగి మండలం నర్సంపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం ప్రకారం.. గ్రామ శివారులోని మహ్మద్ అజామ్ వ్యవసాయ క్షేత్రం వద్ద పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు అక్కడకు చేరుకొని పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 30,120 నగదు, పది సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారు హైదారాబాద్‌లో నివాసం ఉండే నర్సంపల్లికి చెందిన వారిగా గుర్తించారు.

అల్లం సాగుకు.. వేసవి అనుకూలం

- పెట్టుబడి వ్యయం అధికం
- ధర కలిసివస్తే లాభాలు ఘనం
- జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి



జహీరాబాద్ టౌన్: అల్లం.. సుగంధ ద్రవ్యపు పంట. సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడుల సాధనకు మార్గం సుగమం అవటంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అన్ని కాలాల్లో డిమాండ్ ఉండడం .. మద్దతు ధర లభించడం వల్ల కూడా రైతుల దృష్టి ఆకర్షిస్తుంది. సారవంతమైన ఎర్రనేలల్లో పంట దిగుబడి అధికంగా ఉంటుంది. నీరు నిల్వ ఉండని నల్లరేగడిలో కూడా పండుతుంది. అల్లం పెట్టుబడి ఎక్కువగా ఉంటుంది. ఎకరానికి లక్షవరకు ఖర్చవుతుంది. దిగుబడి కూడా అదేస్థాయిలో వస్తుంది. ధర కలిసొస్తే గిట్టుబాటవుతుంది. ఏప్రిల్ రెండవ వారం నుంచి మే నెల రెండవ వారం వరకు అల్లం సాగుకు అనుకూలం. 20 నుంచి 28 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న వాతావరణంలో పంట పెరుగుదల ఆశాజనకంగా ఉంటుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అల్లం పంటను రైతులు సాగుచేస్తున్నారు. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో అధిక విస్తీర్ణంలో పంట సాగవుతుంది. ఎనిమిది నెలల్లో చేతికొచ్చె అల్లంను సేంద్రియ ఎరువులతో సాగుచేస్తూ యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు.


జహీరాబాద్ ప్రాంతంలో పండిస్తున్న అల్లం

నేలలు.. వాతావరణం

ఎర్రనేలలు, గరపనేలలు చెల్క భూములు అల్లం పంట సాగుకు అనుకూలం. నీరు నిలిచే భూములు పనికిరావు. నీడ ఉన్న ప్రదేశాల్లో కూడా పంట పండుతుంది. వర్షపాతం 700 నుంచి 1000 మిల్లీ మీటర్లు ఉన్న ప్రాంతాల్లో కూడా సాగు చేసుకోవచ్చు. ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు విత్తుకోచ్చు.

సాగు విధానం

పొలాన్ని లోతు వరకు దున్ని దుక్కిచేసుకోవాలి. ఎకరానికి 10 టన్నుల పశువుల (సేంద్రియ)ఎరువు, 300 నుంచి 500 కిలోల వేప పిండి, 200 గ్రాముల సింగల్ సూపర్ పాస్పెట్ 25 గ్రాముల మైక్రో న్యూట్రిన్స్ కలిపి తయారు చేసిన బెడ్‌పై వేయాలి. బెడ్‌ను తడిగా చేసి ముందుగా సిద్ధం చేసుకున్న విత్తనం నాటాలి. క్రమం తప్పకుండా నీటి తడులను పెడుతుండాలి. డ్రిప్ విధానం చాలా మంచిది. సాగు చేసే నీరు, వర్షం నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. ఎకరాకు 500 నుంచి 800 కిలోల విత్తనం అవసరమవుతుంది. విత్తన దుంపలను 10 నుంచి 24 గంటలు నానాబెట్టడం వల్ల మొలకల శాతం పెరగుతుంది.

యాజమాన్య పద్ధతులు

'విత్తనం నాటిన 25–40 రోజుల తర్వాత 26 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెటే ఆఫ్ పొటాష్, లేదా 3 కిలోల అమోనియా సల్ఫేట్. 0.5 గ్రాముల పాస్పరిక్ యాసిడ్, 1 గ్రామం మిరెట్ ఆఫ్ పోటాష్ లను కలిపి డ్రిప్ పైపుల ద్వారా నీటిలో వదలాలి. 40–100 రోజుల వ్యవధిలో 54 కిలోల యూరియా, 0.25 గ్రాముల పాస్పరిక్ యాసిడ్, 1 గ్రామం మిరెట్ ఆఫ్ పొటాష్ కలిపి ప్రతి రోజు రెండు నెలల పాటు పంటకు అందించాలి. 100–150 రోజుల వ్యవధిలో యూరియా 1.5 కిలోలు, కాల్షియం నైట్రేట్ 1 కి.గ్రా, మ్యూరిట్ ఆఫ్ పొటాష్ లేదా సల్ఫేట్ 1.5 గ్రాములు కలిపి నీటి ద్వారా అందించాలి. 150–180 రోజుల మధ్య మ్యూరిట్ ఆఫ్ పొటాష్ 1 గ్రామం వేయాలి.


విత్తనం.. రకాలు

మారన్, సుప్రభ, సురుచి, సురభి, వైనాడ్, నదియా, రియోడిజనీరో రకాలు ఎక్కువ దిగుబడి ఇస్తాయి. జహీరాబాద్ ప్రాంత రైతులు అధికశాతం మంది మారన్ రకం పండిస్తున్నారు. ఆరోగ్యవంతమైన తల్లి మొక్క నుంచి విత్తనం సేకరించాలి. విత్తనం పొడుగు 4.5 సె.మీ,30 గ్రాముల బరువు రెండు నుంచి మూడు కన్నులుండాలి. విత్తన దుంపలు 10 రోజుల ముందు నుంచి 24 గంటలు నానబెట్టడం వల్ల మొలక శాతం పెరుగుతుంది. 500 గ్రాముల ఎం45 మందును తగినంత నీటిలో కలిపి అల్లం విత్తనం నానబెట్టాలి. అల్లం విత్తనం నుంచి చిన్న చిన్న మొలకలు మొలిచేంతవరకు అంటే రెండు రోజుల పాటు ఆరబెట్టాలి. ఎకరానికి 5 నుంచి 8 క్వింటాళ్ల విత్తనం అవసరం.

తెగులు నివారణ

రైజోమ్‌వాట్ తెగులు ఆశిస్తే మొక్క ఎండిపోతుంది. ఆకులు పసుపు రంగుగా మారుతాయి. ఈ తెగులు ఆశిస్తే మాటల్ ఎక్సిల్ 2 కి.గ్రా మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రైజోమాప్లే తెగులు సోకుతే అల్లం కుళ్లిపోతుంది. ఎకరానికి 4 కిలోల ఫ్లోరెడ్ గ్రానివల్స్‌ను వేయాలి. లీఫ్ బ్లైట్ తెగుల కారణంగా ఆకులపై చిన్నచిన్న మచ్చాలు ఏర్పడుతాయి.

శతాధిక వృద్ధురాలి మృతి


సరస్వతి (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ మాతృమూర్తి శతాధిక వృద్ధురాలు సరస్వతి (103) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఆమె వందేళ్ల వయసులోనూ తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గత మూడేళ్లుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. అమె మృతి పట్ల ఆలయ ఈఓ శ్రీనివాస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.